క్లుప్తంగా

స్వామిత్వ సర్వే పరిశీలన



రామకృష్ణాపురంలో స్వామిత్వ సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి: మండలంలోని రామకృష్ణాపురంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామిత్వ సర్వే ద్వారా గ్రామాల్లోని భూతగాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అనంతరం స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, సెక్రటరీ సతీష్ తదితరులు ఉన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 2019 ఫిబ్రవరి 14న కశ్మీర్‌లో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో మృతి చెందిన వీర జవానులకు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, ఏపీఎం గంగాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



యల్లమిల్లిలో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసు

గండేపల్లి: భూముల రీ–సర్వేను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని యల్లమిల్లిలో జరుగుతున్న రీ–సర్వే పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు రీ–సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముందుగా రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో సర్వే చేయాలని సూచించారు. గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

17న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

తుని: స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్–2 ఎన్నిక ఈ నెల 17న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 3న జరగాల్సిన ఎన్నిక వాయిదా వేసిన సంగతి తెలిసిందే. మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే ఎన్నికకు కౌన్సిలర్లకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అక్రిడిటేషన్ కలిగిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు కూడా అనుమతి ఉందని చెప్పారు.

శివకేశవుల విగ్రహాలకు అభిషేకాలు



వేంకటేశ్వరస్వామి విగ్రహానికి సంప్రోక్షణ, అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం స్వామివార్ల విగ్రహాలకు సంప్రోక్షణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పండితులు గోపూజ, హోమాలు, పంచగవ్య సహిత జలాధివాసం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ–2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601

ఆదిలోనే రబీ ఆశలు ఆవిరి

- నాట్ల దశలోనే చనిపోయిన వరిచేను
- గగ్గోలు పెడుతున్న అన్నదాతలు
- మళ్లీ దమ్ముచేసి వరినాట్లు వేయిస్తున్న వైనం
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న అధికారులు



తొండంగి మండలం కోదాడలో దెబ్బతిన్న రబీ వరి పంట



వరినాట్లు వేసిన పొలంలో పశువులను మేపుతున్న వైనం

తొండంగి: వరదలు, తుపానులు, ముంపులతో ఖరీఫ్ కలసిరాలేదు. కనీసం రబీలోనైనా పంటలు బాగా పండి కాస్తో కూస్తో పాత అప్పులు తీరతాయని గంపెడాశలతో వరిసాగు చేసిన రైతులకు మళ్లీ నిరాశే మిగులుతోంది. వాతావరణ మార్పులతో నాట్లు వేసిన కొద్ది కాలానికే పంట మొత్తం ఎండిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దిక్కుతోచని స్థితిలో మళ్లీ నాట్లు వేయిస్తున్నారు.

మండలంలోని కోదాడ, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లి, ఏవీ నగరం పరిసర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది ముందుగానే రబీ వరినాట్లు వేశారు. ఖరీఫ్ పంట ఒబ్బిడి కాని ప్రాంతాల్లో కాస్త ఆలస్యంలో నాట్లు పడ్డాయి. కాగా ముందుగా నాట్లు వేసిన సుమారు 40 ఎకరాల వరిపంటకు సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ పంట ఎండిపోయింది. పంట ఎండిపోవడానికి కారణాలు తెలియక బాధిత రైతులు ఆందోళన చెందారు. వాతావరణం ప్రతికూలంగా ఉండటం, చలితీవ్రత దృష్ట్యా ఇటువంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలపడంతో రైతులు చేసేదేమీ లేక మరో మారు నారు వేసి పొలాలను దమ్ము చేయించి వరినాట్లు వేయిస్తున్నారు. పొలాలను దమ్ములు చేయించి, నాట్లు వేయించి ఎకరాకు దాదాపుగా రూ. 13 వేల వరకూ పెట్టుబడి పెట్టిన తర్వాత చేనంతా ఎండిపోయి, తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు వాపోయారు.

ఖరీఫ్‌లోనూ నష్టం

మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఖరీఫ్‌లో పంపా, పీబీసీ ఆయకట్టు, వ్యవసాయ బోర్లు, చెరువుల పరిధిలో దాదాపు 16 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ప్రారంభం నుంచి తుపానులు, అధిక వర్షాలకు అన్ని ప్రాంతాల్లో పంటలు ముంపుబారిన పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గేట్లు మరమ్మతులు, పోలవరం, పుష్కర స్లూయిజ్ పనులు తదితర కారణాలతో పంపా రిజర్వాయర్ పరిధిలో రబీ వరిసాగుకు సాగు నీటి అవకాశం లేదని అధికారులు ప్రకటించడంతో పీబీసీ, వ్యవసాయబోర్లు పరిధిలో మాత్రమే రైతులు రబీ వరిసాగు చేపట్టారు.

మూడు ఎకరాల్లో పంట నష్టం



మా గ్రామంలో నేను మూడెకరాలు కౌలుకు తీసుకున్నాను. ఖరీఫ్‌లో ముంపు కారణంగా పంట సాగు చేయడానికి వీలు లేకుండా పోయింది. రబీలోనైనా పంటను సాగు చేద్దామని ఓం సాయి విత్తనాలు వేశాను. పొలాన్ని దమ్ము చేయించి, కూలీలతో నాట్లు వేయించాను. అనంతరం డీఏపీ, యూరియా మొదటి దఫా ఎరువులు కూడా వేశాను. కాగా దుబ్బు చేయకుండా నాట్లు వేసిన కొద్దికాలానికే పంట చనిపోయింది. దీంతో ఏమి చేయాలో పాలుపోక మళ్లీ కొత్తగా నారు వేసి నాట్లు వేయిస్తున్నాను. దాదాపుగా 50 వేలకు పైగా అప్పుచేసి పెట్టుబడి పెట్టాను.

–దడాల సత్తిబాబు, కౌలు రైతు, కోదాడ, తొండంగి మండలం

పంటలను పరిశీలించాం



సాధారణంగా రబీలో పంటలకు వాతావరణ పరిస్థితులను బట్టి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. కాగా కోదాడలో చనిపోయిన పంటలను పరిశీలించాం. వాతావరణంలో మార్పులు, చలితీవ్రత, పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాల ఆధారంగా పంటలు దెబ్బతినడం చాలా అరుదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

–ఎస్.నరసింహం, మండల వ్యవసాయశాఖాధికారి, తొండంగి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



యర్రవరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కేవీ సూర్యనారాయణ సూచించారు. మండలంలోని యర్రవరం, రమణయ్యపేట గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.15 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. సుమారు 20 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమార్చనలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



తునిలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష కిట్లు అందజేస్తున్న అలయెన్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని అలయెన్స్ క్లబ్ అధ్యక్షుడు కోరుకొండి సత్యనారాయణ సూచించారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు నాలుగు సీలింగ్ ఫ్యాన్లు, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు. తుని మండలంలో పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,116 ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తామని సత్యనారాయణ తెలిపారు. కాగా అలయెన్స్ క్లబ్ సభ్యుడు ఎస్.వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా పెంటకోట రోడ్డులోని సాయిసేవ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వీఎస్ఆర్ ఆంజనేయ ప్రసాద్, పరవాడ తాతబాబు, బత్తుల నాగేశ్వరరావు, నేరెళ్ల అప్పారావు, నూకయ్యశెట్టి, నామన రవి, నెల్లిపూడి రాజబాబు, ప్రధానోపాధ్యాయురాలు నూకరత్నం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో విద్యుత్ స్తంభాలు వేయాలి



ఒమ్మంగి–ఉత్తరకంచి రోడ్డులో వేస్తున్న విద్యుత్ స్తంభాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి నుంచి ఉత్తరకంచి వరకూ నూతనంగా వేస్తున్న త్రీఫేజ్ విద్యుత్ లైను వేస్తున్నారు. కాగా విద్యుత్ స్తంభాలను ప్రభుత్వ భూమిలో కాకుండా జిరాయితీ భూమిలో వేయడంపై స్థానిక రైతులు ములికి చంద్రయ్య, సుంకర ధర్మరాజు, చిక్కాల దొంగయ్య అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒమ్మంగి నుంచి గొపాలుడు చెరువు వరకు రోడ్డుకు ఆనుకొని పంట కాలువ ఉంది. ఈ కాలువ గట్టుకు ఆనుకొని విద్యుత్ స్తంభాలు వేస్తే రైతులకు ఎటువంటి నష్టం ఉండదు. దీనికి విరుద్ధంగా రైతులకు సంబంధించిన జిరాయితీ భూమిలో విద్యుత్ స్తంభాలను వేయడం పట్ల స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో విద్యుత్ స్తంభాలు వస్తే గడ్డి ట్రాక్టర్లు విద్యుత్ వైర్లకు తగిలి దగ్ధమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా పంట కాలువకు ఆనుకొని విద్యుత్ స్తంభాలు వేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ డీఈకి ఫిర్యాదు చేసినా తమ ఫిర్యాదును తీసుకోలేదని రైతులు ఆరోపించారు. విద్యుత్ స్తంభాల పనులను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారని రైతులు వాపోయారు.

వానరాల వీర విహారం



ప్రత్తిపాడు – సామర్లకోట రోడ్డులో ఓ షెడ్డుపై వానరాల గుంపు

ప్రత్తిపాడు: గ్రామంలో నిత్యం ఏదో మూల వానర దాడి జరుగుతూనే ఉంది. శుక్రవారం ఉదయం ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కానీ గ్రామంపై దండయాత్రలా గుంపులు గుంపులుగా వానరాలు ఎగబడ్డాయి. విద్యుత్ సబ్ స్టేషన్, ప్రగతి స్కూల్, సామర్లకోట రోడ్డు, ఆర్‌సీఎం చర్చి, ఇందిరా కాలనీ తదితర ప్రదేశాల్లో జనావాసాలపై దాడి చేశాయి. వృద్ధులు, పిల్లల చేతుల్లో ఉన్న సరకుల సంచులను లాక్కెళ్లిపోతున్నాయి. ఇళ్లల్లోకి ప్రవేశించి తినుబండారాలను, నివాసాలపై ఉన్న వస్తువులను ఎత్తుకెళ్లిపోతున్నాయి. పెరటి మొక్కలను పీకేస్తున్నాయి. బెదిరిస్తే దాడి చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంచు మసకేసిందిలే..



ప్రత్తిపాడులో కమ్మేసిన మంచు

ప్రత్తిపాడు: పల్లెల్లో ప్రతిరోజూ మంచు కురుస్తోంది. ప్రత్తిపాడులో శుక్రవారం ఉదయం భారీగా మంచు కురవడంతో తెల్లవారే పనులకు వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7.30 గంటల వరకూ నింగి నుంచి పుడమిని తాకుతూ పొగమంచు తెరలా కప్పేసింది. కళ్ల ముందున్నవారిని చూడడంకూడా గగనమే అయ్యింది. వాహనదారులు లైట్ల వెలుగులోనే నిదానంగా వెళ్లాల్సివచ్చింది. మామిడి, జీడి మామిడి తోటలకు ఈ మంచుతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బోరుమనిపించకండి !



గెద్దనాపల్లి ప్రభుత్వోన్నత పాఠశాల దగ్గరలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపు

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లి ప్రభుత్వోన్నత పాఠశాల వద్ద ఉన్న చేతి పంపు (బోరు) మరమ్మతులకు గురైంది. కొన్నేళ్లుగా గెద్దనాపల్లిలోని పలు చేతి పంపులు పని చేయకపోయినా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఈ చేతి పంపు నీరే అందరికీ ఆధారం అయ్యేది. పంచాయతీ కుళాయిలు రాకపోతే అత్యవసర పరిస్థితుల్లో చేతిపంపు ఉపయోగపడేదని స్థానికులు చెబుతున్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు మరమ్మతులకు గురైన చేతిపంపులకు రిపేర్లు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కొండరాజులబాబు పండగ



విశేష అలంకరణలో వాల్మీకి, లవకుశులు, సీతాదేవి



ఎస్‌ఎస్ పట్నంలో అడవిరాజులబాబు ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

తుని రూరల్: మండలంలోని తేటగుంటలో కొండరాజులబాబు పండగ శుక్రవారం ఘనంగా జరిగింది. ఏటా మాఘ పౌర్ణమి మరుసటి రోజు నిర్వహించుకునే ఈ పండగను గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాష్ట్రం మరెక్కడాలేని విధంగా ఈ గ్రామంలో వాల్మీకి, లవకుశలు, సీతాదేవి విగ్రహాలను పూజిస్తున్నారు. అధిక సంఖ్యలో గిరిజనులు, భక్తులు వాల్మీకి, లవకుశలు, సీతాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తీర్థం నిర్వహించారు. సాయంత్రం రాజులబాబు గద్దెను గ్రామ శివారులో ఉన్న తోటకు తీసుకువెళ్లి సంబరం నిర్వహించారు.

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, ఎస్‌ఎస్ పట్నం, బీబీ పట్నం, ఎ.మల్లవరం, బలరామపురం, ములగపూడి గ్రామాల్లో శుక్రవారం అడవి రాజులబాబు పండగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు స్థానిక తోటలు, పొలాలకు ఊరేగింపుగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక తోటల్లో అడవి రాజులబాబుగా కొలిచే లవకుశలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే వంటావార్పు చేసుకుని ప్రజలంతా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి విద్యార్థులతో కలసి నిత్యావసరాలు అందిస్తున్న పద్మారావు దంపతులు

కిర్లంపూడి: మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన పీతల వీరవెంకట సత్యనారాయణ విద్యుత్ స్తంభం పైనుంచి పడిపోవడంతో గత పదేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. దీంతో అతని సోదరి కూలిపని చేసుకుంటూ పోషిస్తోంది. పెద్దాపురం మండలం దివిలిలోని అక్షర పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ నూకలమంతి పద్మారావు పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. పద్మారావు భార్య సత్యవేణి, పాఠశాల విద్యార్థులతో కలిసి సింహాద్రిపురంలో బాధితుడి ఇంటికి వెళ్లి రూ.5 వేలు, దుస్తులు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో కందా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడ్



తేటగుంట యనమల క్యాంపు కార్యాలయం వద్ద తొలగించని ఫ్లెక్సీలు

తుని రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు కావడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్నా ప్రవర్తనా నియమావళి అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు కళ్లెదుటే కనిపిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. తేటగుంటలోని యనమల రామకృష్ణుడు, యనమల దివ్య క్యాంపు కార్యాలయం ఎదుట జాతీయ రహదారిని ఆనుకుని భారీగా ఫ్లెక్సీలు ఉన్నా ఇప్పటికీ వాటిని తొలగించకపోగా, ఫ్లెక్సీలు కనిపించకుండా ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. అలాగే తేటగుంట, వల్లూరు, దొండవాక తదితర గ్రామాల్లో సైతం అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఎర్రకోనేరు, తేటగుంటల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు ఎన్నికల కోడ్ అడ్డురావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు, ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రెండువర్గాల మధ్య ఘర్షణ

తుని రూరల్: తేటగుంటలో కొండరాజులబాబు పండగ సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన రికార్డింగ్ డాన్సుల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై నక్కా మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలో జరగకుండా గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

సారాతో ముగ్గురి అరెస్ట్

గండేపల్లి: సారా తయారీ దారులను అరెస్ట్ చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని సూరంపాలెంలో సారా స్థావరాలపై గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో సూరంపాలెం గ్రామానికి చెందిన డి.నాగేశ్వరరావు, టి.సూరిబాబు, ఎం.పోతురాజు సారా తయారు చేస్తుండగా అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీ సమస్యలపై 17న ధర్నా

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలపై ఈ నెల 17వ తేదీన ఆయా ప్రాజెక్టుల పరిధిలో ధర్నా నిర్వహించనున్నట్టు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పెద్దాపురం ప్రాజెక్టు 11వ సెక్టార్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఐటీయూ మద్దతుతో జరిగే ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతి కుమార్, కె వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.